ప్రజాశక్తి
శనివారం 24 ఆగస్టు 2024 5 విజయనగరం

సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు : ఎస్‌పి

ప్రజాశక్తి-విజయనగరం కోట

సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎస్‌పి వకుల్‌జిందాల్ తెలిపారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో సిబ్బంది సమస్యల పరిష్కారానికి పోలీసు వెల్ఫేర్‌డే నిర్వహించారు. సిబ్బంది సమస్యల పట్ల సానుకూలంగా స్పందించారు. వారి నుంచి వినతులు స్వీకరించి పరిష్కారానికి చర్యలు చేపడతానని తెలిపారు. పోలీసు సంక్షేమానికి ప్రాధాన్యత కల్పిస్తానన్నారు. పోలీసు సిబ్బంది నుండివచ్చిన విజ్ఞాపనల్లో సిబ్బంది బదిలీలు, ప్రమోషన్స్, అనారోగ్య సమస్యలు, శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలను నిలిపివేయాలని కోరుతూ వచ్చాయని ఎస్‌పి తెలిపారు.

సిబ్బందిసమస్యలు వింటున్న ఎస్‌పి జిందాల్

స్వర్ణ గ్రామాలుగా మార్చడమే లక్ష్యం

- ఉపాధి పనులపై గ్రామసభలదే నిర్ణయాధికారం
- ప్రజలంతా సమిష్టి నిర్ణయాలు తీసుకోవాలి
- పెదవేమలి, దుప్పాడ గ్రామసభల్లో పాల్గొన్న కలెక్టర్
- జిల్లా వ్యాప్తంగా 775 పంచాయతీల్లో గ్రామసభలు
- జిల జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ తాగునీరు

దుప్పాడ గ్రామసభలో మాట్లాడుతున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరం రూరల్/గంట్యాడ

గ్రామ పంచాయతీ అభివృద్ధికి సంబంధించి ఎలాంటి పనులు చేపట్టాలనే అంశంపై చర్చించి నిర్ణయాలు తీసుకొనే అధికారం గ్రామసభలకే వుంటుందని, ప్రభుత్వ యంత్రాంగం గ్రామసభల్లో తీసుకున్న నిర్ణయాలను ఆమోదించి వాటిని అమలు మాత్రమే చేస్తుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అన్నారు. ఎలాంటి పనులు చేపట్టడం ద్వారా గ్రామ అభివృద్ధి చెందుతుంది, గ్రామ అవసరాలు ఏమిటి, ఏ పనులు గ్రామానికి ఉపయోగకరం అనే అంశాలపై గ్రామసభల్లో చర్చించి ప్రజలంతా కలసి సమిష్టిగా ఒక నిర్ణయం తీసుకోవాలని పేర్కొన్నారు. గ్రామంలో చేపట్టే పనుల ద్వారా గ్రామాలకు ఒక శాశ్వత ఆస్తి సమకూరడంతో పాటు, గ్రామస్థులకు వసతులు కూడా కలగాలన్నారు. రాష్ట్రంలోని గ్రామాలన్నింటినీ స్వయం సమృద్ధిగా స్వర్ణ గ్రామాలుగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. గ్రామంలోని ప్రతి ఇంటికి కనీస అవసరాల కల్పన, గ్రామ ప్రజలందరికీ కనీస వసతుల కల్పన, రోడ్ల అభివృద్ధి గ్రామంలోని ప్రజల సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన ద్వారా స్వర్ణ గ్రామాలు సాధించడమే ఈ గ్రామసభల ముఖ్య ఉద్దేశమని తెలిపారు. గ్రామీణ ఉపాధిహామీ కింద 2024-25 సంవత్సరానికి సంబంధించిన పనుల ఆమోదం కోసం నిర్వహిస్తున్న గ్రామసభల్లో భాగంగా శుక్రవారం జిల్లాలో 775 గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు.

గంట్యాడ మండలం పెదవేమలి, విజయనగరం రూరల్ మండలం దుప్పాడలో జరిగిన ఉపాధిహామీ గ్రామసభల్లో కలెక్టర్ అంబేద్కర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత ఏడాది జరిగిన ఉపాధి పనులు ఏవిధంగా జరిగాయి, వాటి నాణ్యత, అవి గ్రామానికి ఏవిధంగా ఉపయోగపడ్డాయనే అంశాలను చర్చించుకోవాలన్నారు. ప్రస్తుత ఏడాదిలో ఆ గ్రామానికి కేటాయించిన బడ్జెట్‌లో ఏయే పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టాలనేది కూడా నిర్ణయించి ప్రతిపాదించాలన్నారు. జిల్లాలో ఘన వ్యర్థాల నుంచి ఎరువులను తయారుచేసే 630 ప్లాంట్లను గతంలో ఏర్పాటు చేశామని, వాటన్నింటినీ త్వరలో వినియోగంలోకి తీసుకువస్తామన్నారు. గ్రామంలోని వ్యర్థాలను ఎరువుగా మార్చి విక్రయించడం ద్వారా పంచాయతీకి ఆదాయం సమకూర్చే మార్గాలను అన్వేషించాలన్నారు. పెదవేమలి గ్రామ సభ సందర్భంగా పలువురు గ్రామస్తులు తమ ప్రాంతంలో సి.సి.రోడ్లు, కమ్యూనిటీ హాళ్లు, డ్రైయిన్లు నిర్మించాలని కోరారు. దీనిపై స్పందిస్తూ గ్రామస్తులు కోరిన వసతులన్నీ ప్రాధాన్యత క్రమంలో అందుబాటులో వున్న బడ్జెట్ ఆధారంగా పనులు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ శ్రీధర్‌రాజా, ఎంపిడిఒ భవాని, తహశీల్దార్ నీలకంఠేశ్వరరావు, ఎంపిటిసి భవాని, సర్పంచ్ పాపునాయుడు, టెక్నికల్ అసిస్టెంట్ రాధ తదితరులు పాల్గొన్నారు.

మూడు నెలలకొకసారి గ్రామసభలు జరగాలి

దుప్పాడలో జరిగిన గ్రామసభలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకు తప్పనిసరిగా గ్రామసభ జరగాలని చెప్పారు. ప్రతి వ్యక్తి గ్రామ అభివద్ధి కోసం కొంత సమయాన్ని కేటాయించాలన్నారు. కార్యక్రమంలో విజయనగరం ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతి, టిడిపి నాయకులు కిమిడి నాగార్జున, పాలవలస యశస్విని, ఎంపిడిఒ వెంకటేశ్వరరావు, నోడల్ అధికారి అరుణకుమారి, ఎంపిటిసి కృష్ణవేణి, సర్పంచ్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎల్ కోట మండలం చందులూరులో జరిగిన గ్రామసభకు జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సర్పంచ్ యడ్ల సింహాచలం అధ్యక్షతన జరిగిన గ్రామసభలో పలు అభివృద్ధి పనులను గ్రామ సభ పథకం ద్వారా చేపట్టేందుకు తీర్మానం చేశారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి కావలసిన ఏ పనైనా జిల్లా పరిషత్ నుంచి తమ మద్దతు ఉంటుందని తెలిపారు.జల జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి తాగునీరు అందిస్తామన్నారు. గ్రామ అభివృద్ధికి ప్రజాప్రతినిధులు అధికారులు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి గేదెల శ్రీనివాసరావు, జెడ్‌పిటిసి తూర్పాటి వరలక్ష్మి, ఎంపిటిసి యడ్ల కిషోర్, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన వర్సిటీ ఇక్కడే : మంత్రి సంధ్యారాణి

మెంటాడ : ప్రతిష్ఠాత్మక గిరిజన యూనిర్సిటీ వేరేచోటుకు తరలుతుందని జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని యూనివర్శిటీని ఇక్కడే ఏర్పాటు చేస్తున్నామని గిరిజన సంక్షేమశాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. శుక్రవారం మండలంలోని కుంటినవలస గ్రామంలో జరిగిన గ్రామసభలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గిరిజనవర్శటీని కొత్తవలస మండలం రెల్లి గ్రామానికి తరలించనున్నారని వస్తున్న వార్తలను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్ళగా, ఆయన తోసిపుచ్చారని సంధ్యారాణి తెలిపారు. శంకుస్థాపన జరిగిన చోటే పూర్తిచేస్తామని స్పష్టం చేశారని అన్నారు. అందులో ఉద్యోగాల్లో స్థానికులకే ప్రాధాన్యమిస్తామని కూడా ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని వెల్లడించారు. రాష్ట్రంలో వైసిపి హయాంలో ధ్వంసమైన పంచాయతీ రాజ్ వ్యవస్థకు గత వైభవం తీసుకురావడమే గ్రామసభల ఉద్దేశమని చెప్పారు. ప్రతి ఇంటికీ ఇంకుడుగొయ్యి ఏర్పాటు చేయాలని ఆమె కోరారు. ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో తహశీల్దార్ కె.శ్రీనివాసరావు, ఎంపిడిఒ పి.త్రివిక్రమరావు, ఎపిఒ చినప్పయ్య, సర్పంచ్ రమేష్ నాయుడు పాల్గొన్నారు.

గ్రామసభలో మాట్లాడుతున్న గిరిజన సంక్షేమశాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

ఫార్మా కంపెనీ యాజమాన్యాన్ని శిక్షించాలి

సిఐటియు ఆధ్వర్యాన పలుచోట్ల నిరసనలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్/నెల్లిమర్ల/పూసపాటిరేగ

విశాఖ జిల్లా అచ్యుతాపురం ఎసెన్షియా ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదానికి కారణమైన యాజమాన్యాన్ని శిక్షించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యాన శుక్రవారం పలుచోట్ల కార్మికులు ధర్నాలు చేపట్టారు. విజయనగరంలోని జిల్లా పరిశ్రమల ఇన్‌స్పెక్టర్ కార్యాలయం వద్ద ధర్నాను ఉద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ మాట్లాడుతూ ఈ ఘటన రాష్ట్ర ప్రజానీకాన్ని, కార్మికులను తీవ్ర బయాందోళనకు గురిచేసిందన్నారు. ఈ ఘటనకు కారణమైన యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, కార్మికశాఖ అధికారులు, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారులు కంపెనీలలో తనిఖీలు నిర్వహించి కార్మికులకు కనీస భద్రత, రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగినప్పుడు ప్రజాప్రతినిధులు, అధికారులు హడావుడి తప్ప ప్రమాదాలకు కారణమైన యాజమాన్యాలపై చర్యలు తీసుకోవడంలో ఉదాసీనతగా వ్యవహరిస్తున్నారన్నారు. గతంలో జిల్లాలో బయోటెక్, అరబిందో కంపెనీలో కూడా చిన్నచిన్న ప్రమాదాలు జరిగాయని తెలిపారు. గత ఐదేళ్ల కాలంలో వివిధ కంపెనీలలో జరిగిన ప్రమాదాల్లో 119 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారని అన్నారు.. జిల్లాలో భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు జరగకుండా అధికారులు తనిఖీలు విస్తతంగా జరిపి లోపాలను సరిచేసి కార్మికుల ప్రాణాలను కాపాడాలని కోరారు. ధర్నాలో సిఐటియు నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎ.జగన్మోహన్, బి.రమణ, బి.భాస్కరరావు, బి.పాపారావు పాల్గొన్నారు.

న్యాయ విచారణ చేయాలి

మృతి చెందిన కార్మికులు కుటుంబాలకు ప్రభుత్వం న్యాయం చేయాలని సిఐటియు నగర ఉపాధ్యక్షులు రెడ్డి శంకరరావు డిమాండ్ చేశారు. ఎపి బెవరేజస్ కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతుల కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని, యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కంపెనీల్లో సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని, కార్మికులకు రక్షణ, భద్రత కల్పించాలని, అచ్యుతాపురంలో ఇ.ఎస్.ఐ సూపర్ స్పెషాలిటి హాస్పిటల్ నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు కార్యదర్శి బి. రమణ, నాయకులు శ్రీను, డిపో మేస్త్రీ కార్తీ తదితరులు పాల్గొన్నారు.

పూసపాటిరేగ: స్థానిక మైలాన్ పరిశ్రమ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి బి. సూర్యనారాయణ మాట్లాడుతూ పరిశ్రమల్లో జరుగుతున్న ప్రమాదాలపై సిఐటియు అనేక సందర్భాల్లో యాజమాన్యాలను హెచ్చరించినప్పటికీ లాభాలు సంపాదించడమే లక్ష్యంగా పెట్టుకున్న యాజమాన్యాలు ఇటువంటి ఘటనలను పట్టించుకోవడం లేదన్నారు. యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మైలాన్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జి. పుల్లయ్య, అసిస్టెంట్ ట్రెజరర్ ఎ.త్రినాధరావు, ఎంప్లాయిస్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ కమిటీ సభ్యులు బి.ఆదినారాయణ, సిహెచ్. అప్పలనాయుడు పాల్గొన్నారు.

విజయనగరం : పరిశ్రమల ఇన్‌స్పెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

నెల్లిమర్ల : ఎపి బెవరేజెస్ వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు; పూసపాటిరేగలో మైలాన్ కంపెనీ వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

పట్టణ ప్రాంతాల కంటే మెరుగైన సేవలు : ఆరోగ్యశాఖా మంత్రి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్/ సీతానగరం

జిల్లాలో వైద్యులు పట్టణ ప్రాంతాల కంటే మెరుగైన వైద్య సేవలందిస్తున్నారని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ అభినందించారు. శుక్రవారం ఆయన పార్వతీపురం జిల్లా కేంద్రాసుపత్రిని సందర్శించారు. రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వెద్య సేవలను గురించి అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో మౌలిక సదుపా యాలు గూర్చి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. సికిల్‌సెల్ ఎనిమియా రోగులకు కార్డులను అందజేశారు. అనంతరం అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆసుపత్రులకు కావాల్సిన సదుపాయాలు, ఇబ్బందులు గురించి వైద్యాధికారులు మంత్రికి తెలిపారు. సిబ్బంది కొరత, అంబులెన్స్‌ల కండిషన్, ఫీడర్ అంబులెన్స్ సేవలు, ప్రసూతి సేవలను గూర్చి తెలియజేస్తూ, మరణించిన వారిని తీసుకువెళ్లేందుకు గిరిజనులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మహాప్రస్థానం వాహనాలు కావాలని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పార్వతీపురం, సాలూరు, సీతంపేట, భద్రగిరిలో ఆసుపత్రుల భవన నిర్మాణపనులు పూర్తిచేసి, సిబ్బందిని నియమిస్తామని తెలిపారు. ప్రతి ఏరియా ఆస్పత్రికి మహప్రస్థానం వాహనాలు సమకూరుస్తామని హామీ ఇచ్చారు. అనంతరం సీతానగరం మండల కేంద్రంలోని పిహెచ్‌సిని తనిఖీ చేశారు. ఆస్పత్రి భవన నిర్మాణ పనులు అత్యంత నాసికంగా ఉండడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం జోగింపేటలో గల కస్తూరిబా గాంధీ బాలికల జూనియర్ కళాశాలను సందర్శించారు.

సోమవారం గ్రీవెన్స్ రద్దు

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఈనెల 26న కృష్ణాష్టమి సెలవు కారణంగా కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్ సెల్) రద్దు చేస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఎస్‌డి అనిత ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించాలని ఆమె సూచించారు.

26న అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న రాక

ప్రజాశక్తి-విజయనగరం కోట

రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ సిహెచ్ అయ్యన్న పాత్రుడు ఈనెల 26న విజయనగరం రానున్నారు. స్పీకర్ సోమవారం సాయంత్రం 5 గంటలకు నగరానికి చేరుకొని మాజీ ఎం.పి. పి.వి.జి.రాజుపై పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొంటారు. సాయంత్రం 6 గంటలకు బయలుదేరి నర్సీపట్నం వెళ్లనున్నారు.

నిబంధనలకు విరుద్ధం : యుటిఎఫ్

ప్రజాశకి-విజయనగరం టౌన్

జిల్లాలో ఎంఇఒలు సచివాలయం సిబ్బంది అందుబాటులో లేకపోతే ఉపాధ్యాయులు ఫోటోలు తీసి పెట్టాలని చెప్పడం నిబంధనలకు విరుద్ధమని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, నాయకులు తిరిపతినాయుడు, కెప్రసాదరావు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్ల ఫొటోలు తీసే బాధ్యత నుంచి ఉపాధ్యాయులను ప్రభుత్వం తప్పించి సచివాలయ ఉద్యోగులకు అప్పగించినా ఎంఇఒలు నిబంధనలకు వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఉపాధ్యాయులపై పనిఒత్తిడి లేకుండా చూడాలని ప్రభుత్వాన్ని, విద్యా శాఖ అధికారులను కోరారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీల్లో సత్తా

ప్రజాశక్తి - రామభద్రపురం

రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ క్రీడా పోటీల్లో ఆరికతోట బాలికలు సత్తా చాటారు. ఈ నెల 17,18,19 తేదీల్లో శ్రీకాకుళం జిల్లాలో జరిగిన 11వ అంతర జిల్లాల రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ జూనియర్ పోటీల్లో ఆరికతోట జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థినిలు ప్రథమ స్థానంలో నిలిచారు. బాలురలో ఎం.జ్యోతి ప్రకాష్, డి.రాఘవ, బాలికల్లో భువనేశ్వరి, మధురిమ, జయశ్రీలు ప్రథమ స్థానంలో నిలిచి షీల్డ్ కైవశం చేసుకున్నారు. వీరిని పాఠశాల హెచ్‌ఎం శర్మ, ఉపాధ్యాయులు అభినందించారు

విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం శర్మ

ధాన్యం సేకరణ లక్ష్యం 4 లక్షల మెట్రిక్ టన్నులు

- బ్యాంకు గ్యారంటీల లక్ష్యం రూ.350 కోట్లు
- మద్దతు ధర రూ.2300
- కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరం

ఈఏడాది ధాన్యం సేకరణ సజావుగా జరిగేలా చూడాలని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అన్నారు. కొనుగోళ్లకు అవసరమగు వాహనాలు, గన్నీ సంచులు, హమాలీలు, తేమ యంత్రాలు, గోడౌన్ సామర్థ్యం, బ్యాంకు గ్యారంటీ లు, తూనిక యంత్రాలు తదితర సామగ్రిని నెల రోజుల ముందే ఏర్పాటు చేసుకొని సిద్ధంగా ఉండాలన్నారు. ధాన్యం సేకరణ లో పనిచేసే సిబ్బందికి శిక్షణ కూడా పూర్తి చేసుకోవాలని తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఖరీఫ్ ధాన్యం కొనుగోలుపై సంబంధిత అధికారులు, ఎఫ్.పి.ఒలు, రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఏడాది 4.50 లక్షల మెట్రిక్ టన్నుల పంట వస్తుందని అంచనా వేస్తున్నామని , ప్రభుత్వం 4 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. ధాన్యం దద్దతు ధర క్వింటాలుకు కామన్ వెరైటీ రూ.2300గా, గ్రేడ్ ఎ- వెరైటీ రూ.2320గా నిర్ణయించినట్లు తెలిపారు. ఇది గత ఏడాది కంటే రూ.117 రూపాయలు ఎక్కువని తెలిపారు. ఈ ధరలను గ్రామ సభలు ఏర్పాటు చేసి ప్రతి రైతుకు తెలిసేలా అవగాహన కలిగించాలని తెలిపారు. జిల్లాలోని 510 రైతు సేవా కేంద్రాలను 130 రైసు మిల్లులతో ట్యాగ్ చేశామని, మిల్లర్లు బ్యాంకు గ్యారంటీలను 80 శాతం వరకు ఇవ్వాలని తెలిపారు. 300 తూకపు యంత్రాలు అవసరం అవుతాయన్నారు. సంయుక్త కలెక్టర్ సేతు మాధవన్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన టైం లైన్ ప్రకారంగా ధాన్యం సేకరణ జరిగేలా సమన్వయం తో పని చేయాలని తెలిపారు. నవంబర్ 1 నుండి ధాన్యం సేకరణ కు సిద్ధంగా ఉండాలని తెలిపారు. పౌర సరఫరాల జిల్లా మేనేజర్ కె.మీనాకుమారి జిల్లా స్థాయి సేకరణ కమిటీ మార్గదర్శకాలను, కమిటీ సభ్యుల బాధ్యతలు, పాత్రలపై వివరించారు. సమావేశం లో జిల్లా వ్యవసాయ అధికారి తారక రామా రావు, డిఎస్ఒ మధుసూదన్ రావు , రవాణా, ఎఫ్.సి.ఐ., తూనికలు కొలతలు, జిల్లా సహకార అధికారి, ఎఫ్.సి.ఐ ప్రతినిధులు, ఎఫ్‌పిఒ ప్రతినిధులు, మిల్లర్లు పాల్గొన్నారు.

కాలువ పనులు చేపట్టి సాగునీరు అందించండి

ప్రజాశక్తి-గజపతినగరం

పురిటిపెంట, గంగచోళ్లపెంట మధ్యఉన్న బట్టికాలువను పునరుద్దరించి చెరువులకు నీరందించడం ద్వారా రైతులకు సాగునీరు అందించాలని వ్యవసాయ కార్మికసంఘంజిల్లా ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాస్ కోరారు. మండలంలోని పురిటిపెంటలో సర్పంచ్ విజయలక్ష్మి అధ్యక్షతన శుక్రవారం గ్రామసభ జరిగింది.ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి చేపట్టాల్సిన పనులను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. పురిటిపెంట, గంగచోళ్లపెంట మధ్య కాలువను పునరుద్దరిస్తే ఆంధ్ర రిజర్వాయర్ నీరు కాలువ ద్వారా చెరువులోకి వచ్చి పంటలు పండుతాయని తెలిపారు. గ్రామంలో ఉన్న అన్ని చెరువులను అభివృద్ధి చేయాలన్నారు. దుర్గాదేవి గుడి దగ్గర నుంచి గుమ్మా శ్రీనివాసరావు ఇంటి వైపు ఒక రోడ్డు వేయాలని, గ్రామంలో మరియు ఎస్సీ కాలనీలో చంపావతి నదికి దారులకు రోడ్లు వేయాలని, మామిడి బంద, సంతోట కాలనీలో రోడ్లు,కాలువలు నిర్మించాలని కోరారు. నూకాలమ్మ గుడి ఎదురుగా ఉన్న రహదారి నుంచి వంక చెరువుకు ఉన్న గోర్జికి ఉపాధి పనులు చేపట్టాలనికోరారు. ఉపాధి పనులు 200 రోజులు కల్పించాలని, ఒక్క పూటే పని పెట్టాలని, 600 రూపాయలు కూలి ఇచ్చేలా ప్రభుత్వం నిర్ణయం చేయాలని ఆయన కోరారు. మెటీరియల్ కాంపోనెంట్ పనులు 40 శాతం మాత్రమే పెట్టి మిగతా 60 శాతం ఉపాధి కూలీలతో పనిచేయించే విధంగా నిధులు కేటాయించాలని కోరారు. గ్రామసభలో ఎంపిడిఒ కె.కిశోర్‌కుమార్, మాజీమంత్రి జనసేన నాయకులు పడాల అరుణ, గ్రామపెద్దలు కరణం ఆదినారాయణ, మండల సురేష్, టిడిపి మండల అధ్యక్షుడు లక్ష్మునాయుడు, ప్రదీప్ కుమార్, గొర్లె ఆదినారాయణ, జి.ఆదిలక్ష్మి, మంత్రి నర్సింగరావు, తదితరులుపాల్గొన్నారు.

గ్రామసభలో వ్యకాస నాయకులు శ్రీనివాస్

గ్రామసభలో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీనివాస్



మహంతి నారాయణరావు కుటుంబసభ్యులకు కోటీరూపాయల చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కళా వెంకటరావు

మృతుల కుటుంబాలకు పరిహారం పంపిణీ

ప్రజాశక్తి-గరివిడి, పూసపాటిరేగ

అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ఎసెన్షియా ఫార్మా పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు అధికారులు పరిహారం అందజేశారు. గరివిడి మండలం అర్తమూరు గ్రామానికి చెందిన మహంతి నారాయణరావు కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు శుక్రవారం పరామర్శించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు కోటి రూపాయలు చెక్కును అందచేసి వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. వారికి అన్నివిధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే కళావెంకటరావు గారు మీడియాతో మాట్లాడుతూ అచ్చుతాపురం సెజ్ లో జరిగిన ఫార్మా ప్రమాదం దురదష్టకర సంఘటన అని వ్యాఖ్యానించారు. పరిశ్రమల్లో మూడు నెలలకు ఒక్కసారి సేఫ్టీ ఆడిట్ జరగాలని సూచించారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు జరగకుండా భద్రతా ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి సారించి కఠినమైన నిబంధనలు అమలు చేసేలా చర్యలు చేపడతామని

ఈ ప్రమాదంలో మృతి చెందిన పూసపాటిరేగ మండలం గొల్లపేటకు చెందిన బమ్మిడి ఆనందరావు కుటుంబానికి గురువారం అర్థరాత్రి 12గంటల సమయంలో తహశీల్దార్ తాడ్డి గోవింద కోటి రూపాయలు చెక్కును అందజేశారు. మృతుల కుటుంబాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోటి రూపాయలు పరిహారం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈమేరకు పరిహారాన్ని అధికారులు అందజేశారు. కార్యక్రమంలో జనసేన మండల నాయకులు గుడివాడ జమరాజ్, విఆర్ఒ రామకృష్ణ, బి రామారావు, గంగరాజు పాల్గొన్నారు.

రామతీర్థంలో పుష్పార్చన

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రామతీర్థం రామస్వామి దేవస్థానంలో సాముహిక కుంకుమార్చన, పుష్పార్చనలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మూడో శుక్రవారం పురస్కరించుకొని భక్తులు సామూహికంగా కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం శ్రీ వైష్ణవ రుత్వికులు చేత సుందరకాండ పారాయణ పట్టాభిషేకాన్ని వైదిక సిబ్బంది నిర్వహించారు కార్యక్రమంలో విజయ నగరం ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు కుటుంబ సమేతంగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానం సహాయ కమిషనర్, కార్యనిర్వహణ అధికారి వై. శ్రీనివాసరావు పర్యవేక్షణలో సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు

వంద పడకల ఆసుపత్రిగా అప్ గ్రేడ్ చేయండి

ప్రజాశక్తి- బొబ్బిలి

బొబ్బిలి ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అప్ గ్రేడ్ చేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను ఎమ్మెల్యే బేబినాయన, ఆసుపత్రి సూపరింటెండెంట్ జి.శశిభూషణరావు కోరారు. పార్వతీపురం వెళ్లిన మంత్రి బొబ్బిలి కోటకు వచ్చిన సందర్భంగా ప్రతిపాదనలను అందజేశారు. సిహెచ్‌సికు రోజురోజుకు రోగులు తాకిడి పెరుగుతున్న ఆసుపత్రి స్థాయి పెరగకపోవడంతో వైద్యులు, సిబ్బంది కొరత, వైద్య పరికరాలు, బెడ్స్ లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. 100 పడకల ఆసుపత్రిగా అప్ గ్రేడ్ చేయాలని మంత్రిని కోరగా సానుకూలంగా స్పందించారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి బోని రామానందం సూచించారు. శుక్రవారం ఆయన స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా గిరిజన సంక్షేమ జిల్లా అధికారి రామానందం విద్యార్థులను బోధన, భోజనం వివరాలు అడిగి తెలుసుకున్నారు. వసతి గృహంలో స్టాక్ పరిశీలించి, మౌళిక వసతులపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించే విధంగా పర్యవేక్షణతో కూడిన బోధనలు చేయాలని సూచించారు. విద్యను అందించి మౌళిక వసతులకు లోటు కలగకుండా చూడాలని సూచించారు. ఈ విద్యా సంవత్సరం పదవ తరగతిలో శతశాతం ఉత్తీర్ణత సాధించడానికి కృషి జరగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కర్రి సూర్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.

14న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి-బొబ్బిలి

స్థానిక కోర్టులో సెప్టెంబర్ 14న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయాలని పార్వతీపురం రెండో అదనపు జిల్లా జడ్జి ఎస్.దామోదరరావు కోరారు. కోర్టులో శుక్రవారం లోక్ అదాలత్ పై పోలీసులు, ఎస్.ఇ.బి పోలీసులు, న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో అన్ని రకాల సివిల్ కేసులు, రాజీ కాబడే క్రిమినల్ కేసులు పరిష్కారం చేస్తామని, కక్షిదారులు సద్వినియోగం చేసుకునేలా చూడాలని కోరారు. సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి అరుణశ్రీ, అదనపు జూనియర్ సివిల్ జడ్జి రోహిణిరావు, డిఎస్‌పి శ్రీనివాసరావు, పట్టణ, రూరల్ సిఐలు సతీష్ కుమార్, నారాయణరావు, బార్ అధ్యక్షులు పి.మోహన్ మురళికుమార్, న్యాయవాదులు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక ఆక్రమణపై ఫిర్యాదు

ప్రజాశక్తి - భోగాపురం

శ్మశాన వాటిక ఆక్రమణలకు గురవుతుందని భోగాపురం గ్రామంలోని పెద్ద హరిజన పేటకు చెందిన పలువురు పెద్దలు శుక్రవారం తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. పక్కనే ఉన్న జిరాయితీ భూమికి చెందిన రైతులు శ్మశానాన్ని ఆక్రమించేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఒక రైతు ఏకంగా సరుగుడు మొక్కలు నాటేసారని తెలిపారు. శ్మశాన వాటికకు వెళ్ళే రహదారిని సైతం ఆక్రమించేసినట్లు పేర్కొన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో మాజీ ఎంపిటిసి గురువులు, న్యాయవాది గురునాథ్ ఉన్నారు.

సౌర కుటుంబం పై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి- శృంగవరపుకోట

సర్వేపల్లి విద్యానికేతన్ పాఠశాల ఆవరణలో స్పేస్ ట్రిప్ (అంతరిక్షయాత్ర) పేరుతో పిల్లలందరకు అంతరిక్షంలో జరుగుతున్న అనేక రకాల చర్యలు, సౌర కుటుంబంలో నక్షత్రాలు గ్రహాల గమనంపై శుక్రవారం అవగాహన కల్పించారు. డోమ్ ఆకారంలో ఉన్న ఒక థియేటర్లో పిల్లలకు వైజ్ఞానిక పరమైన ఒక ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమాన్ని ఎల్కేజీ పిల్లల నుంచి పదవ తరగతి పిల్లల వరకు వారి వారి తరగతులకు ఆధారంగా ఈ ప్రదర్శన చేశారు. ఇందులో అపోలో టు చంద్రయాన్ అగ్నిపర్వతాల విస్ఫోటనం మొదలగునవి త్రీడిలో చూపించారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల కరస్పాండెంట్ సిహెచ్ సన్యాసిరావు, డైరెక్టర్ వై. వెంకట్రావు మాస్టారు ప్రారంభించారు.

వాహనాలు తనిఖీ

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని గునుపూరుపేట వద్ద శుక్రవారం వాహనాలను ఎస్ఐ సన్యాసినాయుడు సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మోటార్ సైకిల్ పై వెళుతున్న వారిపై డ్రంకండ్ డ్రైవ కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోటార్ సైకిల్ పై గాని ఏ ఇతర వాహనాల్లో అక్రమంగా గంజాయి మత్తు పదార్థాలు మాదక ద్రవ్యాలు వంటివి తరలిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. మోటార్ సైకిల్ లిస్ట తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కోరారు. ప్రతి ఒక్క వాహనదారుడికి లైసెన్స్ తో పాటు ఇన్సూరెన్స్ బండి కాగితాలు ఉండాలన్నారు.

పాఠశాలను సందర్శించిన ఎంఇఒ

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని ఆకులసీతంపేట పాఠశాలను ఎంఇఒ జి.జగదీశ్వరరావు శుక్రవారం సందర్శించారు. పాఠశాల పరిసరాలు పరిశీలించి శిథిలావస్థలో ఉన్న బిల్డింగ్, వంటగది ప్రహరీ గోడలు గురించి రిపోర్ట్ ఇవ్వాలని తెలియజేశారు. విద్యార్థుల తెలుగు, ఇంగ్లీష్ చదివించడం, రాయించడం చతుర్విధ ప్రక్రియలు చేయించడం, టేబుల్స్ చదివించడం,వర్క్ బుక్స్ మిడ్ డే మీల్‌ను పరిశీలించారు.

కంప్యూటర్ రూమ్ ప్రారంభం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేసి కీర్తిశేషులైన ఎం.ఈశ్వరి జ్ఞాపకార్థం ఆమె కుమార్తె పాఠశాలకు రెండు కంప్యూటర్లను వితరణ చేశారు. వాటిని డిప్యూటీ డిఇఒ పీవీ రమణ ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఎంఇఒలు జగదీశ్వరరావు, బాల భాస్కరరావు, ప్రధానోపాధ్యాయులు బిపిఎ రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాకెట్ నమూనాగా విద్యార్థుల ప్రదర్శన

ప్రజాశక్తి- రామభద్రపురం

నేషనల్ స్పేస్‌డే సందర్భంగా శుక్రవారం కొట్టక్కి జిల్లా పరిషత్ హైస్కూల్లో రాకెట్ నమూనాగా విద్యార్థులు చేసిన ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది. సైన్స్ టీచర్ షేక్ షరీఫ్, పీడీ బొత్స రత్నకిశోర్ ఆధ్వర్యంలో విద్యార్థులు ఒక బృందంగా ఏర్పడి రాకెట్ నమూనాను ప్రదర్శించారు. ప్రపంచ అంతరిక్ష చరిత్రలో భారత్ సాధించిన విజయాలను ప్లకార్డుల రూపంలో ప్రదర్శనలు చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం డాక్టర్ రావాడ భాస్కరరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాగి సాగుపై రైతులకు అవగాహన

కొత్తవలస: మండలంలోని చీడివలస యూనిట్ గొల్లలపాలెం, చీడివలస గ్రామంలో జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ఆనంద్ రావు ఆధ్వర్యంలో డేటా ప్యూరిఫికేషన్ గురించి ప్రకృతి వ్యవసాయం చేస్తున్న క్షేత్ర పరిశీలన శుక్రవారం చేశారు. ఈ కార్యక్రమంలో గులి రాగి సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు ఆచరిస్తున్న పద్ధతులు నవధాన్యాలు సాగు, వరిలో లైన్ షోయింగ్, కాలిబాటలు, ద్రవ జీవామృతం పిచికారి, కషాయాలు, ద్రావణాలు పిచికారి, రైతులకు తెలియజేశారు. వరి గట్లపై పండ్ల, జాతి కూరగాయలు మొక్కలు వేయడం వల్ల రైతులకి అదనంగా ఆదాయం వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మంగ, మాస్టర్ ట్రైనర్ కోటిబాబు, శ్యామల, శ్రావ్య, రామలక్ష్మి, అనూష, పాల్గొన్నారు

నేడు విద్యుత్తుకు అంతరాయం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

తంగుడుబిల్లి రూరల్, సతివాడ, రామతీర్థం సబ్ స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ అంతరాయానికి వినియోగదార్లు సహకరించాలని సబ్ స్టేషన్ ఎఇ డి.పిచ్చయ్య కోరారు. తంగుడు బిల్లి రూరల్ ఫీడర్11కెవి పరిధిలో వ్యవసాయ కనెక్షన్ పనుల నిమిత్తం తంగుడుబిల్లి గ్రామం, ఎన్ ఆల్తిపాలెం వ్యవసాయ విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందన్నారు. పైడి భీమవరం నుంచి నాతవలస 33కెవి లైన్‌లో సతివాడ సబ్ స్టేషన్, డి- నెలివాడ సబ్ స్టేషన్ పరిధిలో చెట్టు కొమ్మలు తొలగిస్తున్న నేపథ్యంలో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని వినియోగ దారులు సహకరించాలని ఆయన కోరారు.

అభివృద్ధికి గ్రామ సభలు దోహదం

ప్రజాశక్తి- కొత్తవలస

కొత్తవలస మేజర్ గ్రామ పంచాయతీ సచివాలయం -4 కార్యాలయ ఆవరణలో సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్‌పి ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి మాట్లాడుతూ గత ఐదేళ్ల కాలంలో రాష్ట్రం అభివృద్ధి పూర్తిగా కుంటిబడిందన్నారు. మళ్లీ నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం గాడిలో పెట్టే కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాలను అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో గ్రామీణ ప్రాంతాలకు భారీగా నిధులను కేటాయించామన్నారు. సిపిఎం, సిపిఐ నాయకులు గాడి అప్పారావు, దేగల అప్పలరాజు ఇచ్చిన వినతులపై మాట్లాడుతూ వినతులలో జాతీయ రహదారి 516/బిలో భూములు కోల్పోతున్న వారికి నివాసాలు కోల్పోతున్న వారికి న్యాయం చేయాలని, ఉపాధి హామీ వేతనదారులకు 200 రోజుల వేతనం కల్పించాలని వారికి రోజుకి 600 చొప్పున కూలి వచ్చే విధంగా పార్లమెంట్లో చర్చించాలని కోరారని వాటి పార్లమెంట్లో చర్చించే ప్రయత్నం చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బొండపల్లి: గ్రామ సభలు ద్వారా అభివృద్ధి సాధ్యమని మండల ప్రత్యేక అధికారి దుర్గా ప్రసాద్ అన్నారు. బొండపల్లిలో శుక్రవారం గ్రామ సర్పంచ్ బొండపల్లి ఈశ్వర రావు అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి బండారు బాలాజీ, టిడిపి సీనియర్ నాయకులు బుద్ధరాజు సత్యనారాయణ రాజు, వైస్ ఎంపిపి గొండెలా ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తెర్లాం: మండలంలోని కునాయవలస గ్రామసభలో మండల ప్రత్యేకాధికారి, వ్యవసాయశాఖ జెడి విటి రామారావు పాల్గొని మాట్లాడారు. వ్యవసాయ రంగానికి ఉపాధి హామీ ఎంతో ఉపయోగపడుతుందని, రైతులందరూ పండ్ల తోటలు వాణిజ్య పంటలు సాగు చేయాలని సూచించారు. 38 పనులకు సభలో తీర్మానం చేశారు. కార్యక్రమంలో ఎంఇఒ త్రినాథరావు, సర్పంచ్ విజయబాబు, ఎంపిటిసి శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి స్వామి తదితరులు పాల్గొన్నారు.

చీపురుపల్లి: రాష్ట్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు అన్నారు. మండలంలోని పికె పాలవలస పంచాయతీలో జరిగిన గ్రామ సభ కార్యక్రమంలో మాట్లాడారు. ప్రతీ గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. గ్రామాలకు అవసరమైన ఉపాధి పనులను గుర్తించి ప్రణాళిక రూపొందించాలని అధికారులకు ఆదేశించారు. గ్రామ ప్రజల నుంచి వినతులు స్వీకరించి, సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కె.రామకృష్ణరాజు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజాం: పట్టణంలో రహదారుల నిర్మాణ పనులకు రూ.6 కోట్లు నిధులు కేటాయించినట్లు ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ శుక్రవారం అన్నారు. శ్యాంపురం పంచాయతీలో గ్రామసభకు ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్ర ప్రజలు ఎంతో సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో గ్రామాలు అభివృద్ధి జరగలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీనివాసరావు, రాజాం టిడిపి మండల అధ్యక్షులు సుమల వెంకట మన్మధరావు, గురవాన నారాయణ, భవిరి శ్రీనుబాబు, కోటగిరి నారాయణరావు పాల్గొన్నారు.

కొత్తవలస : వినతులు స్వీకరిస్తున్న ఎమ్‌పి భరత్, ఎమ్మెల్యే లలితకుమారి

రేగిడి: మండలంలోని సంకిలి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అప్‌గ్రేడ్ చేసి, జూనియర్ కళాశాల ఏర్పాటుకు కృషి చేయాలని మండల టిడిపి సీనియర్ నాయకులు నారు జనార్ధన రావు, రమణ వినతి పత్రంలో ఎంపిడిఒ శ్యామల కుమారిని కోరారు. శుక్రవారం గ్రామ సర్పంచ్ బుడుమూరు పట్టాభి అధ్యక్షతన సచివాలయం వద్ద గ్రామ సభ నిర్వహించారు. ఇంటర్ విద్యకు విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పాలకొండ- రాజాం ప్రధాన రహదారి సంకిలి హై స్కూల్లో ఇంటర్ కళాశాల ఏర్పాటు చేస్తే ఎన్నో గ్రామాల విద్యార్థులకు ఇంటర్ విద్య కల నెరవేరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంకిలి కార్యదర్శి శైలజ, విఆర్ఒ గోపాలరావు, వైసిపి మండల విప్ మజ్జి శ్రీనివాసరావు, పంచాయతీ పాలకవర్గం, గ్రామస్తులు పాల్గొన్నారు.

సంతకవిటి: మన గ్రామాల అభివృద్ధి చేసుకునే బాధ్యత మన చేతిలో ఉందని ఎంపిడిఒ జీవి రవికుమార్ అన్నారు. గోళ్లవలస గ్రామసభలో ఎంపిడిఒ మాట్లాడుతూ విష జ్వరాలు అధికంగా ఉన్న గోళ్లవలస పంచాయతీలో మంచినీటిపై పరీక్ష చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ శాంతికుమారి, పంచాయతీ సర్పంచ్ దాసరి దాలినాయుడు, టిడిపి నాయకులు మన్నెన రమేష్, వావలపల్లి రమేష్, వెంపటాపు మురళి, శ్రీరాములు, పైల చక్రధర్ పాల్గొన్నారు.

రామభద్రపురం: గ్రామ పంచాయతీలను ఆదర్శంగా తీర్చిదిద్ది బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. మండల పరిధిలోని కోట శిర్లాంలో శుక్రవారం గ్రామ సభలో కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం పంచాయతీ వ్యవస్థను పటిష్టం చేయడానికి అనేక చర్యలు తీసుకుంటుందన్నారు. ఇందులో భాగంగా గ్రామ పంచాయతీల్లో సిమెంట్ రోడ్లు, కాలువల నిర్మాణానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఆరికతోటలో వివిధ సమస్యలు, కాలువలు, కల్వర్టులు, పొలానికి నీరు వెళ్లే కాలువల నిర్మాణాలకు అంచనాలు వేసి నోడల్ అధికారి సత్యారావుకు అందించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు అల్లు రమేష్, కనకల శ్యాం తదితరులు పాల్గొన్నారు.

మెరకముడిదాం: సమస్యను వింటున్న జెడ్‌పి చైర్మన్ శ్రీనివాసరావు

మెరక ముడిదాం: గ్రామాలాభివృద్ధి కోసం జిల్లా పరిషత్ నుంచి ఎల్లప్పుడూ తన సహకారం ఉంటుందని జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని ఉత్తరవిల్లి గ్రామ పంచాయతీలో సర్పంచ్ విజయమ్మ అధ్యక్షతన జరిగిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. గ్రామాభివృద్ధికి అందరూ కలసి పని చేయాలన్నారు. బైరిపురంలో జరిగిన గ్రామ సభలో సర్పంచ్ పప్పల విజయ కుమారి, ఉప సర్పంచ్ పప్పల క్రిష్ణ మూర్తి, గ్రామ పెద్దలు పప్పల గ్రహణేశ్వరరావు, వైస్ ఎంపిపి కందుల పార్వతి, మాజీ సర్పంచ్ కె. ధనంజయ, కందుల మల్లి కార్జునరావు, పంచాయతీ కార్య దర్శి దామోదర్ పాల్గొన్నారు.

శృంగవరపుకోట: ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసుకోవచ్చని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. మండలంలోని 26 గ్రామపంచాయతీలో శుక్రవారం గ్రామ సభలను నిర్వహించారు. అందులో భాగంగా పట్టణంలోని మేజర్ పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన గ్రామ సభలో ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి పాల్గొని మాట్లాడారు. ఉపాధి హామీ పథకం ద్వారా పశువుల గొర్రెల, కోళ్ల ఫారాల నిర్మాణాలు, వ్యవసాయ భావి నిర్మాణం, గడ్డి పెంపకం, ఫీడర్ కాలువలు పంట కాలువలతో సహా 38 రకాల పనులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు వబ్బిన సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

బాడంగి: మండలంలో 25 పంచాయతీల్లో శుక్రవారం గ్రామ సభలు నిర్వహించామని ఎంపిడిఒ ఆంజినేయులు తెలిపారు. ఈ గ్రామసభ ద్వారా పంచాయతీలో ఉన్న సమస్యలను పరిష్కరించుకోవచ్చునన్నారు. ఈ సమావేశంలో ద్రాక్షారం సర్పంచ్ అరుణ, ఎరుకుల పాకల ఎంపిటిసి పాలవలస గౌరు తదితరులు పాల్గొన్నారు.

వేపాడ: మండలంలోని 29 గ్రామ పంచాయతీలలో గ్రామ సభలు నిర్వహించారు. బొద్దాం గ్రామసభలో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి పాల్గొని మాట్లాడారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గ్రామాల అభివృద్ధి కోసం రూ. 4,500 కోట్లు కేటాయించారన్నారు. ఆ నిధులతో గ్రామాల అభివృద్ధి కోసం అవసరమైన మౌలిక సదుపాయాలను సర్పంచుల ఆధ్వర్యంలో తీర్మానం చేసుకుని ప్రతిపాదనలు పంపించాలన్నారు. ఈ సమావేశంలో ప్రత్యేకాధికారి లక్ష్మీ నరసింహ, ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్, పంచాయతీ విస్తరణ అధికారిని జి ఉమా, మండల స్థాయి అధికారులు, ఎంపిపి దొగ్గ సత్యవంతుడు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాజాం : శ్యాంపురం సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోండ్రు మురళి

రామభద్రపురం : కోట శిర్లాం సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బేబినాయన

ప్రకాశం పంతులు స్ఫూర్తి ప్రదాత

ప్రజాశక్తి-విజయనగరం కోట/టౌన్

స్వాతంత్ర్య సమర యోధుడు టంగుటూరి ప్రకాశం పంతులు స్ఫూర్తి ప్రదాతయని, భవిష్యత్ తరాలకు ఆదర్శ ప్రాయులని కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. ప్రకాశం పంతులు జయంతిని శుక్రవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. టంగుటూరి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రానికి మొదటి ముఖ్య మంత్రిగా పని చేసిన టంగుటూరి ప్రకాశం పంతులు నిరుపేద కుటుంబంలో పుట్టి, వారాలు చేసుకుంటూ చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకున్నారని తెలిపారు. ఆంధ్ర రాజకీయాల్లో ప్రముఖంగా వెలుగొందిన వ్యక్తుల్లో ప్రకాశం పంతులు ఒకరని అన్నారు. టంగుటూరి 1952 లో ఎస్.కోట నియోజకవర్గం నుండి ఎమ్మెల్యే గా పోటీ చేసారని, మన జిల్లాతో ఆయనకు అనుబంధం ఉండడం విశేషమని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిఆర్ఒ ఎస్.డి.అనిత, డిబిసిడబ్ల్యు కిడారి సందీప్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఎఒ దేవ్ ప్రసాద్, పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో టంగుటూరి చిత్రపటానికి ఎస్‌పి వకుల్ జిందాల్ పూలమాల వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో సైమన్ కమిషన్ భారతీయులపై కాల్పులు జరపగా, వారికి ఎదురుగా నిలిచి గుండెలు చూపిన ధీరుడు ప్రకాశం పంతులని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, న్యాయవాదిగా, రాజకీయవేత్తగా, రచయితగా, సంపాదకీయునిగా రాణించి ఆంధ్ర రాష్ట్రానికి జాతీయ స్థాయిలో ఎనలేని కీర్తి తీసుకొచ్చారని కొనియాడారు. కార్యక్రమంలోఎఎస్‌పి అస్మాఫర్హీన్, ఎఆర్ అదనపు ఎస్‌పి ఎంఎం సోల్మన్, డిఎస్‌పిలు, సిఐలు, పాల్గొన్నారు.

టంగుటూరి చిత్రపటానికి పూలమాలవేస్తున్న ఎస్‌పి వకుల్

జిల్లా పరిషత్ కార్యాలయంలో ప్రకాశం పంతులు చిత్రపటానికి జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులర్పించారు. టంగుటూరి జీవితం నేటి తరానికి ఎంతో ఆదర్శవంతమైనదని అన్నారు. జెడ్‌పి సిఇఒ శ్రీధర్ రాజా, డిప్యూటీ సిఇఒ రాజకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నగర పాలక సంస్థ కార్యాలయంలో టంగుటూరి చిత్రపటానికి సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమలరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రకాశం పంతులు ఆశయాలు భవిష్యత్ తరాలకు ఆదర్శప్రాయమని అన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

తెర్లాం: మండల కేంద్రంలో ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 150వ జయంతి ఎంపిడిఒ ఎస్ రామకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాజకీయ నాయకుల్లో నాటి నుండి నేటి వరకు విలువలు కలిగిన నిజాయితీ నిస్వార్థంతో రాజకీయాలు చేసిన ఏకైక వ్యక్తి టంగుటూరి ప్రకాశం పంతులని కొనియాడారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో శాఖ అధికారి సిహెచ్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి కార్యక్రమాన్ని విద్యార్థులతో కలిసి నిర్వహించారు.

బొండపల్లి: మాజీ ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం సమాజానికి ఆదర్శ ప్రాయులుగా నిలుస్తారని తహశీల్దార్ డోల రాజేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో టంగుటూరి ప్రకాశం 152వ జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. తొలిత టంగుటూరి ప్రకాశం చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘన నివాళలు అర్పించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ వైవి. రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో టంగుటూరి ప్రకాశం జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

శృంగవరపుకోట: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్ర కేసరి జయంతి ఉత్సవాలను చరిత్ర శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు .ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ ముందుగా టంగుటూరు ప్రకాశం పంతులుగారు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. స్వతంత్ర సంగ్రామానికి వెన్నుముక వంటి వ్యక్తి ఆంధ్ర కేసరి అని గుర్తు చేశారు. ఆంధ్ర రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రి కావడంతో ఇతని పేరు మీద రాజమండ్రిలో ప్రకాశం బ్యారేజ్ నిర్మించారని నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో చరిత్ర ఉపన్యాసకులు చల్ల శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ ఏ వాసుదేవరావ్, డాక్టర్ వి సుధీర్, ఎన్‌ఎస్‌ఎస్ ఎఒ డాక్టర్ జి ఈరన్న, భాస్కర్, ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కన్వీనర్ శ్రీలక్ష్మి, వైఆర్సి కోఆర్డినేటర్ చల్లా శ్రీనివాసరావు, పీడీ కె.శివ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో భవిష్యత్తు నాశనం

ప్రజాశక్తి- బొబ్బిలి

మత్తు పదార్థాలతో యువత భవిష్యత్తు నాశనం అవుతుందని డిఎస్‌పి పి.శ్రీనివాసరావు అన్నారు. మత్తు పదార్థాలకు, మహిళలపై అత్యాచారాలకు వ్యతిరేకంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో ర్యాలీ చేసి శ్రీవేణుగోపాలస్వామి ఆలయ మండపంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మద్యం, మత్తు పదార్థాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. మద్యం, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోరారు. బాలికలు, మహిళలను గౌరవించాలని కోరారు. పట్టణ సిఐ కె.సతీష్ కుమార్ మాట్లాడుతూ మత్తు పదార్థాలు వాడిన, అమ్మిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మహిళలు, అమ్మాయిలను గౌరవించాలని కోరారు. ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్ చేసినా, మహిళలను లైంగిక వేధింపులు చేసినా కఠిన శిక్షలు పడతాయని హెచ్చరించారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.విజయగౌరి మాట్లాడుతూ మహిళలను ఆట వస్తువుగా పాలకులు చూడడం వల్ల రోజురోజుకు అత్యాచారాలు, లైంగిక వేధింపులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కలకత్తాలో జూనియర్ డాక్టర్ పై హత్యాచారం చేయడం చూస్తే దేశంలో మహిళలకు ఎలా రక్షణ ఉందో అర్థం చేసుకోవచ్చునన్నారు. మహిళలపై వేధింపులు, దాడులకు పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు పి.రామ్మోహన్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యలు పరిష్కారానికి పోరాటం చేయడంతో పాటు విద్యార్థులు, యువతను మంచి మార్గంలో నడిపేందుకు ఎస్ఎఫ్ఐ పని చేస్తుందన్నారు. బాలికలు, మహిళలకు రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ లోవరాజు, ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షులు మణికుమార్, నాయకులు శివ, విద్యార్థులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి

రామభద్రపురం: ప్రజలందరూ చట్టాలపై అవగాహన పెంపొందించు కోవాలని బొబ్బిలి రూరల్ సిఐ నారాయణరావు తెలిపారు. శుక్రవారం సాయంత్రం కొట్టక్కి రామమందిరం ఆవరణలో అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి భద్రతా ప్రమాణాలు పాటించాలని వాహనాలు నడిపేవారు హెల్మెట్, సీటు బెల్టు ధరించి నిబంధనల మేరకు అన్ని ధ్రువ పత్రాలు కలిగి ఉండాలని నియమిత వేగంతో ప్రయాణాలు చేయాలని సూచించారు. మైనర్లకి వాహనాలను ఇవ్వరాదని హెచ్చరించారు. బాలికలు, స్త్రీలపట్ల నేరాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు తప్పవన్నారు. మాదక ద్రవ్య రవాణా, సేవనం చట్ట విరుద్ధమని అటువంటి అలవాట్లకు స్వస్తి చెప్పాలన్నారు. ఇటీవల సైబర్ నేరాలు అధికంగా నమోదు అవుతున్నాయని సైబర్ నేరగాళ్ల వలలో చిక్కకుండా ఉండేందుకు చిట్కాలు వివరించారు. ఈ సమావేశంలో గ్రామ నాయకులు, ప్రజా ప్రతినిదులు, ప్రజలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బొబ్బిలి: మాట్లాడుతున్న డిఎస్‌పి శ్రీనివాసరావు

అధ్యాపక పోస్టుకు దరఖాస్తులు

ప్రజాశక్తి - గుర్ల

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జంతు శాస్త్రం అధ్యాపక పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ సురేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అధ్యాపక పోస్ట్ గెస్ట్ పోస్టుగా నియామకం కోసం దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. అర్హత గల అభ్యర్థులు ఈ నెల 27వ తేది 5గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సంబంధిత సబ్జెక్టులో 50 శాతం మార్కులు సాధించి ఉండాలన్నారు.

ఎంఇఒకు వినతినిస్తున్న ఉపాధ్యాయులు

ఆ ఫొటోలు తీయలేం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ఎస్‌ఎంసి టిఎంఎఫ్ లాగిన్‌తో ఉపాధ్యాయులం ఫోటోలు తీయలేమని యుటిఎఫ్ నాయకులు తెలిపారు. శుక్రవారం ఎంఇఒలను కలిసి మరుగుదొడ్ల ఫొటోస్ ఎస్‌ఎంసి సభ్యులతో తీయించడం విషయమై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఎస్‌ఎంసి వాళ్ళు అందుబాటులో లేకపోతే వాళ్ళ లాగిన్‌తో ఉపాధ్యాయుల్నే ఫొటోస్ తియ్యమని ఎంఇఒలు సిఆర్‌ఎమ్‌టిలతో ఫోన్‌లు చేయిస్తున్నారన్నారు. ఇలా తాము చేయలేమని ప్రాతినిధ్యం చేస్తున్న యుటిఎఫ్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీవి రమణ, వి ఎస్ దేముడు, నారాయణ, ఎ శ్రీనివాస్, ఎ రాము, ఎం పార్వతి, నాయుడు, మూర్తి, వెంకటరావు, అప్పలరాజు తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ కాకినాడ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S. 150/2023

Between:

వాది: అంబటి రామారావు

AND

ప్రతివాది: మందారపు జగదీష్‌కుమార్, S/o. లేటు రామారావు, డోరు నెం. 34, శ్రీనివాస నగర్, వెంకటేశ్వరస్వామి గుడి దగ్గర, విజయనగరం, విజయనగరం జిల్లా.

పై నెంబరు దావాలో ప్లయింటు షెడ్యూలు దాఖలా ఆస్తిలో నుండి ప్రతివాదిని ఖాళీ చేయించి సదరు ఆస్తిని వాదికి స్వాధీనం చేయించమనియు మరియు యితర పరిహారములు నిమిత్తం వాది గారు ప్రతివాది పయిన దాఖలు చేసిన పై నెంబరు దావాలో పైన తెలిపిన ప్రతివాదికి ఎన్ని పర్యాయములు శ్రీ కోర్టు వారి ఆర్డరు ప్రకారం దావా సమనులు పంపించిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నందున, సదరు ప్రతివాది పై కోర్టు వారి ఎదుట **ది. 05-9-2024వ సం॥రం తేదీని పగలు గం॥ 10.30 ని॥లకు** హాజరయి ఆక్షేపణలు వున్న ఎడల తెలియపర్చుకోవలెను. లేని యెడల మీ పరోక్షమందు తీర్మానించబడునని యిందు మూలంగా తెలియపర్చడమైనది.

అల్తాఫ్ మహమ్మద్
కాకినాడ వాది తరపు అడ్వకేటు
07-8-24 సెల్: 9848047860

మద్యం మత్తులో యువకుడు మృతి

ప్రజాశక్తి-గుర్ల

గుర్ల గ్రామానికి చెందిన బోడ సింగి సన్యాసినాయుడు(43) మద్యం మత్తులో మృతి చెందినట్లు శుక్రవారం పోలీసులు గుర్తించారు. ఈ సంఘటన నాలుగు రోజులు క్రితం విశాఖ గ్రామీణ బ్యాంకు మేడ పైన జరిగినట్లు గుర్తించారు. మేడ పై నుంచి చెడు వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరు కొని మృతుడి వివరాలు సేకరించి గుర్ల గ్రామానికి చెందిన బోడసింగి సన్యాసినాయుడుగా గుర్తించారు. సన్యాసినాయుడు గోశాడ గ్రామానికి చెందిన సత్యవతిని 15ఏళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. నిరంతరం మద్యం మత్తులో వుంటూ నాలుగు రోజులు క్రితం ఇంటి దగ్గర నుంచి కనిపించకుండా వెళ్లిపోయాడు. అప్పట్నుంచి కుటుంబ సభ్యులు వెతికినప్పటికీ. ఆచూకీ దొరకలేదు. మతుడికి భార్య సత్యవతి, ఇద్దరు పిల్లలు హేమలత (10) గౌతం (7) ఉన్నారు. గుర్ల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-విజయనగరం కోట

నగరంలోని బాలాజీ నగర్‌లో ఈనెల 10,12తేదీల్లో జరిగిన చోరీ ఘటనల్లో నిందితుడిని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ సిఐ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. వన్‌టౌన్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో శ్రీనివాస్ మీడియాకు వివరాలు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన డి.లింగం అనే నిందితుడను అరెస్టు చేసి అతని నుంచి వెండి ఆభరణాలు, నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇళ్లల్లో ఎవరూ లేని సమయంలో ఇంటి తలుపుల తాళం విరగొట్టి ఇంటిలోకి చొరబడి విలువైన వస్తువులను, నగదును దొంగిలించాడని తెలిపారు. ఎస్‌పి సూచన మేరకు లాడ్జి తనిఖీలు, వాహనాల తనిఖీ చేపట్టామని, ఈ నేపథ్యంలో నిందితుడ్ని విజయనగరం రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతంలో అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలిస్తామని తెలిపారు. నిందితుడిపై రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటివరకు 70కుపైగా కేసులు ఉన్నాయని తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-గజపతినగరం

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినటుల విజయనగరం రైల్వే ఎస్ఐ బాలాజీ తెలిపారు. శుక్రవారం బోడసింగిపేట సమీపంలో పట్టాలు దాటుతున్న వ్యక్తిని బరంపూర్ నుంచిసూరత్ వెళ్లే రైలు ఢీకొనడంతో ఆయన మృతి చెందినట్లు తెలిపారవు. మృతుడి మోచేతిపై ఇంద్రాదేవి అనే పచ్చబొట్టు ఉందని, ఇంకా ఎటువంటి ఆధారాలూ లేవని తెలిపారు. మృతేహాన్ని ప్రభుత్వాస్పత్రిలో భద్రపర్చినట్లు తెలిపారు.